పెత్తందారులపై చర్యలు తీసుకోవాలి : కెవిపిఎస్

గంగవరం : బైరెడ్డిపల్లి మండలం నెల్లిపట్ల గ్రామంలో బార్బర్ షాపుల్లో దళితులకు కటింగ్, షేవింగ్ చేసేది లేదని పెత్తందారుల మాటకు కట్టుబడి వివక్ష చూపడాన్ని కెవిపిఎస్ జిల్లా నాయకులు ఈశ్వర్ ఖండించారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గతంలోనూ ఇటువంటి ఘటన జరిగిందని గుర్తు చేశారు. అప్పట్లో పెత్తందారులు వారి పలుకుబడిని ఉపయోగించి ఎస్సీ, ఎస్టీ కేసు నీరుగార్చారని, అదే ఘటన పునరావృతం అయ్యిందని, ఓ చదువుకున్న వ్యక్తి కటింగ్ చేయాలని కోరగా షాపు నిర్వాహకుడు తాము చేయబోమని నిక్కచ్చిగా చెప్పడం ఏంటని ప్రశ్నించారు. కటింగ్ చేస్తే ఊరి పెద్దలు తమను ఊళ్లో ఉంచబోరని క్షౌరవృత్తి యజమానులు వాపోయారు. ఇలాంటి ఘటనలు జరిగినపుడు అధికారులు సర్దుకుపోమని చెప్పడం మానేసి వివక్ష చూపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. పెత్తందారులపై, బార్బర్ షాపు నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో బాధితులతో కలిసి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

సామాజిక సాధికారిత జగన్‌కే సాధ్యం

డిప్యూటీ సిఎంలు నారాయణస్వామి, అంజాద్‌బాషా

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

సామాజిక సాధికారిత వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి, సిఎం జగన్మోహన్‌రెడ్డికే సాధ్యమని డిప్యూటీ సిఎంలు నారాయణస్వామి, అంజాద్‌బాషా వెల్లడించారు. చిత్తూరు నగరంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సామాజిక సాధికారత బస్సు యాత్ర విజయవంతమైంది. గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు చిత్తూరు నగరంలోని సూర్యప్రతాప్ కళ్యాణమండపానికి చేరుకుంది. సామాజిక సాధికార యాత్రలో రాష్ట్ర ఉప ముఖ్య మంత్రులు నారాయణస్వామి, అంజాద్ భాష, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వేణుగోపాలకష్ణ రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్రావు, విజయనగరం ఎంపీ చంద్రశేఖర్, చిత్తూరు ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు పాల్గొన్నారు. కొలుత సూరి ప్రతాప్ కళ్యాణ మండపంలో గంటపాటు చిత్తూరు నగరంలోని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నగరవాసులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ క్రమంలో చిత్తూరు నగరంలో చేపట్టాల్సిన సంక్షేమ కార్యక్రమాలను నగరవాసులు మంత్రుల దష్టికి తీసుకెళ్లారు. అనంతరం సూర్య ప్రతాప్ కళ్యాణ మండపం నుంచి స్థానిక నాగ కళాక్షేత్రం వరకు బస్సు యాత్ర సాగింది. ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాష మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో చిత్తూరు ఎమ్మెల్యేగా ఆరని శ్రీనివాసులు, చిత్తూరు ఎంపీగా రెడ్డప్ప తిరిగి అభ్యర్థులుగా పోటీ చేస్తారని, తప్పకుండా వాళ్ళను గెలిపించాలని

పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు నియోజకవర్గ పరిధి నుంచి పెద్ద ఎత్తున వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అలిగి వెళ్లిన విజయానందరెడ్డి

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ గురువారం నిర్వహించిన సామాజిక సాధికారత యాత్రలో భాగంగా చిత్తూరు నగరం నాగయ్య కళాక్షేత్రం వద్ద నిర్వహించిన బహిరంగ సభ ప్రారంభానికి ముందు ఏపీఎస్‌ఆర్టీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంసీ విజయానందరెడ్డి సభకు హాజరు కాకుండానే తిరిగి ఇంటికి వెళ్లిపోయారు. సభ ప్రారంభానికి ముందు విజయానందరెడ్డి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డితో పాటు పలువురు మున్సిపల్ కార్పొరేటర్లు, సభా వేదిక పైకి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు సమీప బంధువు, లోకేష్ విజయానందరెడ్డిని వేదిక పైకి రాకుండా అడ్డుకోవడంతో అలజడి ప్రారంభమైంది. దీంతో కోపోద్రికుడైన విజయానంద రెడ్డి, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి కార్పొరేటర్లు లోకేష్ పై చేయి చేసుకున్నారు. అనంతరం పోలీసులు వచ్చి ఇరు గ్రూపులను విడదీశారు. వేదిక పైకి అనుమతించక పోవడంతో మన స్థాపం చెందిన చెందిన విజయానంద రెడ్డి తమ అనుచరులతో సామాజిక సాధికార బస్సుయాత్ర సభ నుండి మధ్యలోనే వెళ్లిపోయారు. దీంతో చిత్తూరు నియోజకవర్గంలో వైకాపా పార్టీ నాయకుల మధ్య వర్గ విభేదాలు సామాజిక సాధికార బస్సుయాత్ర సభలో మరోసారి బయటపడ్డాయి. ఇదిలా ఉండగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మంత్రులు, నాయకులకు విలువ ఇస్తూ సామాజిక న్యాయం పాటిస్తూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వేదిక పైకి వెళ్లకుండా కిందనే కుర్చీలో కూర్చొని కాసేపు మంత్రుల ప్రసంగాన్ని విన్నారు. అనంతరం మంత్రి రోజాతో కలిసి తిరుపతికి వెళ్లిపోయారు.

సామాజికవర్గాల వైసిపి నేతల ఐక్యతారాగం

ఆర్డీవో ఆధ్వర్యంలో గ్రామసభ

దళితుల ఆలయ ప్రవేశం

దగ్గరుండి దళితునికి కటింగ్‌చేయిస్తూ...

దగ్గరుండి 'కటింగ్' చేయించారు..!

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

- 'గ్రామసభ'తో సమస్య పరిష్కారం
- ఆలయంలోకి దళితుల ప్రవేశం
- శభాష్ అనిపించుకున్న అధికారులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'పోరాడితే పోయేదేమీ లేదు... బానిస సంకెళ్లు తప్ప'.. అక్షరాలా నిజమయ్యింది చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలం నెల్లిపట్ల గ్రామ దళితుల విషయంలో.. అందరిలా తాను మనిషినేనని, తనకు ఎందుకు కటింగ్, షేవింగ్ చేయరని ఓ యువ దళితుడు ప్రశ్నించాడు.. 'దళితులకు క్షౌరం చేస్తే మీ షాపులకు మేం రాబోం' అని పెత్తందారులు హుకుం జారీ చేశారని, ఈ కారణంగానే తప్ప తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే ఊరి పెద్దల మాటకు కట్టుబడి క్షౌరం చేయడానికి నిరాకరించాడు క్షౌరవృత్తిదారుడు.. దీంతో ఆగ్రహించిన దళితుడు ఊళ్లోకి వెళ్లి దళితులను చైతన్యపరచి ఎస్ఐకి, తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఉన్నతాధికారులు గ్రామసభ నిర్వహించి ఇరు వర్గాలకు సర్దిచెప్పి, పెత్తందారులను హెచ్చరించి, ఆర్‌డిఒ సాక్షిగా దళితునికి క్షౌరం చేసేలా చేయించి 'శభాష్' అనిపించుకున్నారు. పోరాట స్ఫూర్తి నింపిన దళితుల చైతన్యాన్ని బుధవారమే 'ప్రజాశక్తి' పత్రిక వెలుగులోకి తెచ్చింది. గురువారం ఉన్నతాధికారుల స్పందనతో వివక్షకు చెక్ పడింది. వివరాలిలా ఉన్నాయి.

బైరెడ్డిపల్లి మండలం నెల్లిపట్ల పంచాయతీ పరిధిలో కాపలనత్తం, ఓటేరుపాళ్యం, నల్లగుంట్లపల్లి, సంతపేట తదితర ఏడు గ్రామాల్లో వెయ్యి కుటుంబాలకు పైగా ఎస్సీ, ఎస్టీలు జీవనం సాగిస్తున్నారు. వీరికి రైతుల పొలాల్లో పనిచేయడం, భవన నిర్మాణ కూలీలుగా పనులు చేస్తున్నారు. అటవీ ప్రాంతంలో ఎకరా, అర ఎకరా డికెటి పొలం ఉన్నప్పటికీ అడవి జంతువులు పంటను ధ్వంసం చేస్తున్న నేపథ్యంలో ఆ భూములను బీడుగా మార్చేశారు. దీంతో కూలీలుగా మారిపోయారు. రోజంతా కష్టపడి పనిచేస్తే రోజుకు 150 రూపాయలు కూలి ఇచ్చి, భోజనం గిట్టుబాటు అవుతుంది. ఈ ప్రాంతంలో ఉపాధి హామీ పనులు లేకపోవడంతో రైతుల పొలాల్లోనే వీరికి పని. అయితే వెయ్యి కుటుంబాల్లో యువత కొంతమంది చదువుకున్నవారు ఉన్నారు. బైరెడ్డిపల్లి, నెల్లిపట్లలో క్షౌరం చేయించుకునే షాపులు ఉన్నాయి. దళితులు ఆ షాపుకు వస్తే తాము వచ్చి క్షౌరం చేయించుకోబోమని క్షౌరవృత్తిదారులను హెచ్చరించారు. బుధవారం నెల్లిపట్లకు చెందిన దళితుడు సౌందర్యరాజన్ కటింగ్ చేయాలని శివకుమార్ బార్బర్ షాపుకు వచ్చాడు. అయితే క్షౌరవృత్తిదారులను హెచ్చరించడంతో భయపడిన శివకుమార్ క్షౌరం చేయడానికి నిరాకరించాడు. పెత్తందారులు రాకపోతే తమ జీవనానికి ఇబ్బందని ప్రాధేయపడ్డాడు. ఇదేంటి అన్యాయం అని సౌందర్యరాజన్ ప్రశ్నించారు. ఊళ్లో దళితుల సాయంతో బైరెడ్డిపల్లి పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ మోహన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. తహశీల్దార్ కె.కుమారస్వామికి వినతిపత్రం సమర్పించారు.

స్పందించిన ఆర్డీవో మనోజ్‌కుమార్‌రెడ్డి

పలమనేరు ఆర్డీవో మనోజ్‌కుమార్‌రెడ్డి, తహశీల్దార్ కుమారస్వామి, ఎస్ఐ మోహన్‌కుమార్ గురువారం నెల్లిపట్ల గ్రామానికి చేరుకుని గ్రామసభ నిర్వహించారు. ఎస్సీలకు జరిగిన అన్యాయాన్ని క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో ఎస్సీలకు జరిగిన అన్యాయాన్ని ఖండించారు. కటింగ్ షాపు వద్దకు నేరుగా వెళ్లి ఎస్సీలకు కటింగ్ చేయాలని దగ్గరుండి చేయించారు. అదేవిధంగా గుడిలోకి ఎస్సీలను రానివ్వడం లేదని వారికి తెలియపరచడంతో ఆ సమస్యనూ శాశ్వతంగా పరిష్కరించారు. ఇకపై దళితులపట్ల వివక్ష చూపితే సహించేది లేదని పెత్తందారులను హెచ్చరించారు.

'డెంగ్యూ' జ్వరాల పట్ల నిర్లక్ష్యం వద్దు : సిహెచ్‌ఓ

ప్రజాశక్తి - యాదమరి

డెంగ్యూ జ్వరాల పట్ల నిర్లక్ష్యం వద్దు అని యదమరి సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ సూచించారు. యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిన్నంపల్లి గ్రామంలో ఓ వ్యక్తికి డెంగ్యూ జ్వరం రావడంతో గురువారం సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ సబ్ యూనిట్ ఆఫీసర్ పీరు సాహెబ్ చిన్నంపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సిహెచ్‌ఓ మాట్లాడుతూ జ్వరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిర్లక్ష్యం తగదన్నారు. జ్వరమే కదా అని నిర్లక్ష్యం చేస్తే అది మనిషిని ప్రాణాపాయస్థితికి తీసుకెళుతుందని గుర్తు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమలను నివారించాలన్నారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రైడే పాటించాలని ఆయన ప్రజలకు సూచించారు. సిబ్బందిచే గ్రామం మొత్తం సర్వే నిర్వహించి మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ లక్ష్మీపతి, మహిళా ఆరోగ్య కార్యకర్త అపర్ణ శిల్ప, ఆశా కార్యకర్తలు పద్మ, వినాయకమ్మ తదితరులు పాల్గొన్నారు

ప్రజలకు పారిశుధ్యం పట్ల అవగాహన

మామిడి ఎగుమతులను ప్రోత్సహించాలి

వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్

ప్రజాశక్తి - చిత్తూరు

జిల్లాలో ప్రధాన పంట అయిన మామిడిలో ఖర్చులు తగ్గించుకుని, నాణ్యమైన పంటను పొందేలా, ఎగుమతులను ప్రోత్సహించేలా శాస్త్రవేత్తలు, అధికారులు తగు సూచనలు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పి.రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం ఉద్యానవన శాఖ కార్యాలయంలో రానున్న కాలంలో మామిడిలో తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులు, శాస్త్రవేత్తలు, అధికారులతో ఉద్యానవన శాఖ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ శాస్త్రవేత్తల సూచనలు, అధికారుల సలహాలను రైతులు పాటించాలన్నారు. నాణ్యమైన టేబుల్ వెరైటీస్ ఉత్పత్తయితే ఇతర దేశాల్లో మంచి ధరలు ఉన్నాయన్నారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 58వేల హెక్టార్లలో మామిడి సాగు అవుతుందని, ఒక్కో హెక్టారుకు పది టన్నులు ఉత్పత్తి అవుతుందని,

తద్వారా దాదాపు ఆరు లక్షల టన్నుల మామిడి ఉత్పత్తి ఉంటుందని, తోతాపురి రకం పల్ప్ చేసేందుకు 31 పరిశ్రమలు ఉన్నాయన్నారు. టేబుల్ వెరైటీస్‌లో నాణ్యత పాటిస్తే రైతుకు మంచి ధర వస్తుందన్నారు. క్రిమిసంహారక మందుల వాడకం తగ్గించి, సేంద్రీయ ఎరువులు ఉపయోగించడం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు పొందే అవకాశం ఉందన్నారు. జిల్లాలో మామిడిలో వస్తున్న సమస్యల గురించి కూలంకుషంగా చర్చించారు. సీనియర్ శాస్త్రవేత్త నాగరాజు మాట్లాడుతూ వాతావరణంలో సమతుల్యత లోపించిందని, గాలిలో తేమ శాతం తగ్గడం ద్వారా పురుగులు ప్రధానంగా కీడు చేసే పురుగులు భారీ ఎత్తున పెరగడం, పంటలను నష్టపరచడం జరుగుతుందన్నారు. మామిడి తోటల్లో ఎక్కువ రకాల చెట్లు ఉండటం వల్ల ఆయా చెట్ల కాలపరిమితి వేర్వేరుగా ఉండటం వల్ల, తోటలలో కత్తిరింపు చేసేటపుడు సరైన పద్ధతులు పాటించకపోవడం వల్ల పురుగులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. వీటిని అదుపు చేసేందుకు మందులు కొట్టడం జరుగుతుందని, తద్వారా నాణ్యత లోపిస్తుందన్నారు. నాణ్యమైన ఉత్పత్తులు సాధిస్తే టేబుల్ వెరైటీస్‌కు ఎగుమతి వీలుగా ఉంటుందని, యంత్ర సామాగ్రిని మరింత విస్తృతంగా సరఫరా చేసి ఖర్చులు తగ్గించేలా రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించాలని ఉద్యానవన యూనివర్సిటీ మాజీ వైస్‌ఛాన్సలర్ బిఎన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ అవార్డు గ్రహీత కట్టమంచి బాలకష్ణారెడ్డి, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్ రెడ్డి, అన్నమయ్య జిల్లా ఉద్యానవన అధికారి రవిచంద్రబాబు, శాస్త్రవేత్తలు శ్రీనివాసులు రెడ్డి, సందీప్ నాయక్, రైతులు వెంకటరెడ్డి, నాగేశ్వరరావు, గోవర్ధన్ బాబి, తలపులపల్లి బాబు రెడ్డి, శివకుమార్, ఆనంద నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఐటి హబ్‌గా 'శెట్టిపల్లి' : అభినయ్‌రెడ్డి

- దీర్ఘకాలిక భూ సమస్యకు పరిష్కారం
- లబ్దిదారులకు ప్రొసీడింగ్ అందించిన భూమన్

సభలో కరుణాకర్‌రెడ్డి, అభినయ్‌రెడ్డి, కలెక్టర్, సిపిఎం నేత కందారపు మురళి, ఆర్డీవో తదితరులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శెట్టిపల్లి భూ సమస్య 75 ఏళ్ళ నాటిది. స్వాతంత్యం అనంతరం రెగ్యులరైజ్ కాకుండా మిగిలి పోయిన చిన్న గ్రామం. ప్రభుత్వాలు మారుతున్నా భూ సమస్యకు ఇచ్చిన హామీలు హామీలుగానే మిగిలిన నేపథ్యంలో ఎలాగైనా శెట్టిపల్లి రైతులు, ప్లాట్ల కొనుగోలుదారులకు చక్కటి పరిష్కారం కోసం సిఎం జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, కలెక్టర్, జేసి, మండల రెవిన్యూ యంత్రాంగం అందరూ కలిసి కట్టుగా చిత్తశుద్ధి, నిబద్దతతో పనిచేయడంతో ఈ రోజు శెట్టిపల్లి భూ సమస్యకు పరిష్కారం లభించి లబ్ధిదారుల్లో సంతోషం వచ్చిందని తిరుపతి శాసనసభ్యులు, టీటీడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. గురువారం శెట్టిపల్లి సచివాలయం వద్ద శెట్టిపల్లి రైతులకు, ప్లాట్ల కోనుగోలుదారులకు ప్రొసిడింగ్స్‌ను అందించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ భూ సమస్యను పరిష్కరించడానికి ఏ ఒక్క రూపాయి వసూలు చేయలేదన్నారు. కేవలం శెట్టిపల్లి గ్రామస్థులకు, ప్లాట్ల కోనుగోలుదారులకు ఇచ్చిన మాట ప్రకారం నిస్వార్ధంగా మేలు చేశామన్నారు. నాలుగున్నరేళ్ళ కాలంలో ఎంతో సంతోషానిచ్చే అంశం శెట్టిపల్లి భూ సమస్య పరిష్కారమన్నారు. జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి, జేసి డికె బాలాజీ మాట్లాడుతూ శెట్టిపల్లి భూ సమస్య జిల్లా ఏర్పాటైన రెండు వారాల్లోనే తమ వద్దకు వచ్చిందన్నారు. దీన్ని పరిష్కరించడానికి అనేక మార్లు ఎమ్మెల్యే భూమన, డిప్యూటీ మేయర్ అభినయ రెడ్డి, శెట్టిపల్లి భూ పరిరక్షణ కమిటీ వారు, మరో వైపు సిఎం నుండి ఆదేశాలు ఇలా వచ్చిన ఒత్తిళ్ళను సంతోషంగా స్వీకరించామని, సమిష్టి కృషితో నేడు శెట్టిపల్లి భూ సమస్యకు పరిష్కారం చూపామన్నారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి మాట్లాడుతూ శెట్టిపల్లి భూ సమస్య చాలా జఠిలమైనదని, రైతులకు, ప్లాట్ల దారులకు న్యాయం చేస్తూ ప్రొసిడింగ్స్ ఇవ్వగలిగామన్నారు. ఈ విషయంలో అత్యంత క్లిష్టమైన ప్లాట్లదారులను అందరినీ ఒక్కతాటిపైకి తీసుకొచ్చి సమస్య సులువుగా పరిష్కారం అవ్వడంలో సిపిఎం నేత కందారపు మురళి ఎంతో కృషి చేశారన్నారు. 348 సాగు భూముల్లో 248 మందికి, 2448 ప్లాట్ల దారుల్లో 1396 మందికి ప్రొసిడింగ్స్ ఇచ్చామన్నారు. ఇందులో 85 శాతం భూ సమస్య పరిష్కారం అయ్యిందని, మరో రెండు వారాల్లో మిగిలిన 15 శాతం భూ సమస్య పరిష్కారం అవుందన్నారు. ఇంకా 12 లే అవుట్లు సిద్ధం చేయవలసి ఉందని, అదీ త్వరలో పరిష్కరిస్తామన్నారు. శెట్టిపల్లిని ఐటి హబ్‌గా తీర్చిదిద్దుతూ తెలుగుగంగ నీటిని అందిస్తామన్నారు. మంగళం ఆర్‌టీఓ ఆఫీసు నుండి శెట్టిపల్లి గేటు వరకు మూడు నెలల్లో 80 అడుగుల రోడ్డును వేస్తున్నామన్నారు. సిఐటీయు రాష్ట్ర నాయకులు కందారపు మురళి మాట్లాడుతూ చిన వయస్కుడు అయినా శెట్టిపల్లి భూ సమస్య గురించి అభినయ రెడ్డి బాగా అర్ధం చేసుకొని సమస్యను పరిష్కరించడంలో మంచి చొరవ చూపారని అన్నారు. అనేక సంవత్సరాలుగా శెట్టిపల్లి భూ సమస్య పరిష్కారం కోసం ధర్నాలు, వినతులు పోరాటాలు చేశామన్నారు. మంచి కార్యాచరణతో భూ సమస్యకు పరిష్కారం లభించిందని, అధికారులు, ఎమ్మెల్యే భూమన, అభినయరెడ్డి అందరి సమిష్టి కృషితో శెట్టిపల్లి రైతులకు, ప్లాట్లదారులకు న్యాయం జరిగిందన్నారు. ఒక్క శాతం టీటీడి నిధులు తిరుపతి అభివృద్ధికి వినియోగించాలనే విషయంలో ముందుండి పోరాడామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ ఆర్.శిరీష, కమీషనర్ హరిత, ఆర్డిఓ నిషాంత్ రెడ్డి, తాహశీల్దార్ వెంకటరమణ, డిప్యూటీ తాహశీల్దార్ అశోక్ రెడ్డి, విఆర్‌ఓలు భూపతి, సుమన్, స్థానిక వైసిపి నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

పౌరసరఫరా శాఖ డిప్యూటీ కలెక్టర్‌గా రేణుక

చిత్తూరు : చిత్తూరు జిల్లా పౌరసరఫరాల శాఖ సివిల్ సప్లై విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ రేణుక కలెక్టర్ ను కలిశారు. గురువారం జిల్లా సచివాలయంలో జిల్లా కలెక్టర్ ఎస్. షన్మోహన్ ను సివిల్ సప్లైస్ విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ గా నియామకం అయిన రేణుక మర్యాద పూర్వకం గా కలిశారు.

పాత కలెక్టరేట్ భవనం పరిశీలన

చిత్తూరు అర్బన్ : పాత కలెక్టరేట్‌లోని ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ ఎస్. షన్మోహన్ గురువారం పరిశీలించారు. వయోజన విద్య, ఆడిట్, చుడా, మైనింగ్ కార్యాలయాలను పరిశీలించారు. ఆ భవనాల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ రికార్డులు భద్రపరచిన గదిని కలెక్టర్ పరిశీలించారు. డి ఆర్ ఓ ఎన్.రాజ శేఖర్, కలెక్టరేట్ ఏఓ కుల శేఖర్ ఉన్నారు.

నేడు గంగవరంలో 'జగనన్నకు చెబుదాం'

చిత్తూరు అర్బన్ : ప్రతి మంగళ, శుక్రవారాల్లో మండల కేంద్రంలో జరిగే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పలమనేరులో జరగనుందని కలెక్టర్ ఎస్.షన్మోహన్ తెలిపారు. ఈనెలలో జరిగే షెడ్యూల్ వివరాలను పత్రికలకు వెల్లడించారు. 3న గంగవరంలో, 8న కార్వేటినగరంలో, 10న నింద్రలో, 15న చిత్తూరు అర్బన్‌లో, 17న తవణంపల్లిలో, 22న చౌడేపల్లిలో, 24న కుప్పం రూరల్‌లో, 29న పలమనేరు రూరల్‌లో ఈ కార్యక్రమం జరగనుంది.

కాణిపాకంలో సమాచార శాఖ మంత్రి

చిత్తూరు అర్బన్ : గురువారం సాయంత్రం రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సినిమాటోగ్రఫీ, వెనుక బడిన తరగతుల శాఖా మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కష్ణ శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారిని దర్శించు కున్నారు.. స్వామి వారి చిత్ర పటాన్ని మంత్రికి అంద జేశారు. కాణిపాకంలో మంత్రి వెంట ఈ ఓ వెంకటేశు, ఎ ఈ ఓ కష్ణారెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాబు ఉన్నారు.

కుప్పం సిడిపిఓను సస్పెండ్ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - పలమనేరు

కుప్పం ప్రాజెక్టులో అంగన్‌వాడీలను వేధిస్తున్న సిడిపిఓను సస్పెండ్ చేయాలని గురువారం పలమనేరు ప్రాజెక్టు అధికారికి సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, అంగన్‌వాడీ వర్కర్స్‌యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మ మాట్లాడుతూ కుప్పం ప్రాజెక్టులో రోజురోజుకీ వర్కర్లపై వేధింపులు తీవ్రస్థాయికి చేరాయన్నారు. వీటిని ప్రశ్నిస్తున్న నాయకురాలు ప్రమీలను మరో కార్యకర్త కవితలను విధుల నుంచి తొలగించడం దుర్మార్గమన్నారు. అక్రమంగా తొలగించిన వీరిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిడిపిఓ అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తూ వర్కర్లను బూతులు తిడుతూ మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. శుక్రవారం కుప్పంలో అంగన్‌వాడీల నిరసన ఉంటుందన్నారు. కుప్పం సిడిపిఓపై చర్యలు తీసుకోకపోతే పోరాటాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం సంఘం జిల్లా కార్యదర్శి ఓబుల్ రాజు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య, పలమనేర్ సిఐటియు నాయకులు గిరిధర్ గుప్తా, సుబ్రహ్మణ్యం, అంగన్వాడీ యూనియన్ నాయకులు పద్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు కుప్పంలో అంగన్‌వాడీల నిరసన

పిఇఎస్‌లో అలరించిన వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

యాదమరి మండల పరిధిలోని పి ఈ ఎస్ పబ్లిక్ పాఠశాలలో శాస్త్రీయ దక్పథాన్ని పెంచే దిశగా అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో నవంబరు 1,2 తేదీలలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో భాగంగా దాదాపు 120 కి పైగా సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనను చిత్తూరు డివైఈవో చంద్రశేఖర్ ప్రారంభించి, నమూనాలను తిలకించి, ప్రయోగాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ మనిషి చేసే ప్రతి పనిలోనూ విజ్ఞాన శాస్త్రం దాగి ఉందని,విజ్ఞాన శాస్త్రం అంటే ఒక సత్యాన్వేషణ, ఒక క్రమబద్ధమైన విజ్ఞానం అని కొనియాడారు. అనంతరం పి ఈ ఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వై.వి.కష్ణ బాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయడానికి ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపకరిస్తాయని, అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఇంత విజయవంతమైందని, చిత్తూరు పరిసర ప్రాంతాలలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు దాదాపు 2500 మంది,100 కు పైగా ఉపాధ్యాయులు ఈ ప్రదర్శనను తిలకించారన్నారు. ఈ ప్రదర్శనలో భాగంగా వక్షశాస్త్రం, జీవశాస్త్రం, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, గణిత శాస్త్ర విభాగాలకు సంబంధించిన 120 కి పైగా సైన్స్ నమూనాలను ప్రదర్శించడం జరిగింది. ఇందులో పప్పెట్ షో, రోబోటిక్ నమూనాలు చాలా ప్రత్యేకంగా అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కుమారస్వామి నాయుడు పాల్గొన్నారు.

నేడు 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి-గంగవరం: ప్రజా సమస్యల పరిష్కారానికి గంగవరం మండలంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ మధుసూదన్‌రెడ్డి, తహశీల్దార్ అమర్నాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్ఎల్‌వి కళ్యాణ మండపంలో ఉదయం 10గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో అన్ని శాఖల అధికారులు హాజరవుతారని వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్జీ రూపంలో సమస్యను తెలియజేయాలన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గంగవరం మండల సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు ఎంపిడిఓ కార్యాలయంలో సమావేశం జరుగుతుందన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరవ్వాలని కోరారు.

కమ్మవారి వైభవం కమిటి నియోజకవర్గ అధ్యక్షుడిగా దీపక్ చౌదరి

దీపక్ చౌదరి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: కమ్మవారి వైభవం కమిటి గంగాధర నెల్లూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా దీపక్ చౌదరిని నియమిస్తూ ఆ కమిటి జాతీయ ప్రధాన కార్యదర్శి సురేష్ చౌదరి నియామక పత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా గురువారం దీపక్ చౌదరి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవిని అప్పజెప్పినందుకు కమ్మ సామాజిక వర్గాని ఐక్యం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో కమిటీలు ఏర్పాటు చేసి బలోపేతం చేస్తానన్నారు.

ఘనంగా ఉపసర్పంచ్ జన్మదిన వేడుకలు

కేక్ కట్ చేస్తున్న లోకనాథంనాయుడు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలోని తగువారిపల్లి పంచాయతీ ఉప సర్పంచ్ లోకనాథంనాయుడు అని మండల టిడిపి యువత అధ్యక్షుడు రమేష్ అన్నారు. గురువారం మండల టిడిపి కార్యాలయంలో లోకనాథంనాయుడు పుట్టినరోజు వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ మండలంలో పార్టీకి, ప్రజలకు అందు బాటు లో ఉంటూ లోకనాథంనాయుడు సేవలందిస్తున్నారన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు గిరిబాబు, జాకీర్, రవి పలువురు తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మండల ఇన్‌ఛార్జి ఎంపిడీవోగా సుధాకర్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండల ఇంచార్జ్ ఎంపిడిఓగా సుధాకర్ నియమితులయ్యారు. ఆయన ఇప్పటి వరకు మండల కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ (ఎఓ)గా విధులు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు గురువారం ఇంచార్జ్ ఎంపిడిఓగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఎంపిడిఓ శ్రీదేవి డిఎల్‌డీవోగా ఉద్యోగోన్నతిపై వెళ్లారు.

ఇంచార్జ్ ఎంపిడిఓ సుధాకర్

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గెలుపొందిన విద్యార్థులు

ప్రజాశక్తి-సోమల: జోనల్ క్రీడా పోటీల్లో సోమల మండలం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. గురువారం మండలంలోని కందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అధికారులు పుంగనూరు జోనల్స్ క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ క్రీడల్లో భాగంగా సీనియర్ బాయ్స్ విభాగంలో టెన్నికాయిట్, త్రోబాల్ పోటీలలో సోమల ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి బహుమతి సాధించి విన్నర్స్‌గా నిలిచారు. నియోజకవర్గ స్థాయిలో మొత్తం 18 జట్లు పాల్గొనగా, త్రోబాల్ ఫైనల్ పోటీల్లో సమయాభావం వల్ల కందూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, సోమల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఉమ్మడి విజేతలుగా ప్రకటించగా, టెన్నికాయిట్ విభాగంలో సోమల మండలం సూరయ్యగారిపల్లి ఉన్నత పాఠశాలలు అత్యధిక స్కోరుతో ప్రతిభ కనబరిచి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుని విన్నర్ గా నిలిచారు. మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్న జట్టు జిల్లా స్థాయి జట్టుకు కూడా అర్హత సాధించి కప్పును కైవసం చేసుకుందని పీడీ కరుణానిధి తెలిపారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ జెడ్పి చైర్మన్ కుమార్‌రాజా అన్నారు. గురువారం మండలంలోని బంగారుపాళ్యం-2 సచివాలయంలో సర్పంచ్ ఉమాదేవి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు ప్రజలకు వైద్య సేవలు అందించారు.

ఘనంగా వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ



ప్రజాశక్తి-సోమల: మండలంలోని వల్లిగట్ల పంచాయతీ జమ్ములగుట్ట గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా కోలాహలం నడుమ నిర్వహించారు. టిటిడి శ్రీవాణి ట్రస్ట్ వారి ఆర్థిక సహాయంతో సమరత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఆలయ నిర్మాణం మహా సంప్రోక్షణ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. కుంభాభిషేకం, కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో భక్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మహిళలకు వస్త్రాలు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గూడూరు పట్టణానికి చెందిన ఫిజియోథెరపీ డాక్టర్ దేవరపు చంద్రశేఖర్ రెడ్డి, స్వాతి దంపతులు దాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు కడివేటి చంద్ర శేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలన్నారు. యువత సమాజసేవలో భాగస్వామ్యం కావాలన్నారు.

రెవెన్యూ కేసులు సత్వరం పరిష్కరించండి

- డిఆర్‌వో రాజశేఖర్

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌వో

ప్రజాశక్తి-చిత్తూరు: రెవిన్యూకు సంబంధించి జిల్లాలో వివిధ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి యన్.రాజశేఖర్ పేర్కొన్నారు. గురువారం రాత్రి డిఆర్‌ఓ చాంబర్ నందు రెవిన్యూకు సంబంధించి ప్రభుత్వ కేసులు పరిష్కారంపై లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఓ మాట్లాడుతూ రెవిన్యూకు సంబంధించి జిల్లాని వివిధ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వానికి సంబంధించి వివిధ రకాల కేసులను లా అధికారులు తొందరగా పరిష్కారం చేయాలని వారికి సూచించారు. ప్రతి నెల మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసులు ఎన్ని కేసులు పరిష్కారం చేసిన వాటికి సంబంధించి, ఇంకా మిగిలిన కేసులు ఏయే స్టేజిలో ఉన్నాయాని, మండలాల వారిగా కేసుల వివరాలకు సంబంధించి రిపోర్ట్‌ను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ప్రతి నెల పంపించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్ నుండి సి సెక్షన్ పర్యవేక్షకులు వాసుదేవన్, లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధి ఉంటే మెగా డిఎస్‌సి నిర్వహించండి

- టిడిపి యువనేత జేవి శివప్రసాద్ డిమాండ్

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే మెగా డిఎస్‌సి నిర్వహించాలని టిడిపి యువనేత జెవి శివప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం స్థానికి టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ప్రతి ఏటా జాబ్ క్యాలండర్ విడుదల చేస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 45వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డిఎస్‌సి నిర్వహించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే చర్యలు తీసుకోవాలని మండిపడ్డారు. దీంతో పాటు ఎస్సీ, బీసీ, మైనార్టి కార్పొరేషన్‌లకు నిధులు మంజూరు చేయకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. నిరుద్యోగులు తిరగబడే రోజుల్లోనే ఉన్నాయని, మరో మారు చంద్రబాబుని సీఎం చేయడం తథ్యం అన్నారు. సమావేశంలో టిడిపి నేతలు ఉదయ్‌కుమార్, ఆనంద్‌బాబు, అభి, మూర్తి, దేవేంద్రకుమార్, అరుల్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న శివప్రసాద్

మైనారిటీ పథకాలను ప్రచారం చేయాలి

- రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న అబ్దుల్ కలీం

ప్రజాశక్తి-పుంగనూరు: రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న మైనారిటీ పథకాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ సిబ్బందికి సూచించారు. పుంగనూరులోని ఉర్దూ గ్రంథాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా మైనారిటీల అభ్యున్నతికి విశేష కృషి చేస్తోందన్నారు. అలాగే ఉర్దూ భాషాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రద్ధ చూపుతున్నట్లు తెలిపారు. గతంలో రాష్ట్రంలోని రెండు జిల్లాల్లో మాత్రమే ఉర్దూను ద్వితీయ అధికార భాషగా అమలు చేస్తుండగా, ప్రస్తుతం అన్ని జిల్లాల్లోనూ ద్వితీయ అధికార భాషగా అమలు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. ఈనెల 11న విజయవాడలో రాష్ట్రస్థాయిలో ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మైనారిటీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా మైనారిటీలకు రూ.12,885కోట్ల మేరా లబ్ధి చేకూరిందని ఆయన వెల్లడించారు. పలు సంక్షేమ పథకాల అమలు విధాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని నసీబ్ జాన్, సిబ్బంది సలీం మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయండి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: తెలుగుదేశం పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పూతలపట్టు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ మురళి మోహన్ అన్నారు. గురువారం ఆయన మండల నాయకులతో సమావేశమైయ్యారు. అంతకు ముందు మొగిలి శివాలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మురళిమోహన్‌ను టిడిపి మండల అధ్యక్షుడు జయప్రకాష్‌నాయుడు సత్కరించారు. ఈ సందర్భంగా మురళిమోహన్ నాయకులు, కార్యకర్తలకు పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జనార్ధన్ గౌడ్, కోకా ప్రకాష్‌నాయుడు, లోకనాథం నాయుడు, వంశీ చౌదరి, ధరణి, రమణ, గురుస్వామి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఇంచార్జ్‌ను సత్కరిస్తున్న నాయకులు

మండల అభివృద్ధే లక్ష్యం

- వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజి

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజి అన్నారు. గురువారం కార్వేటినగరంలోని బిసి కాలనీలో సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో రూ.7లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో బీసీ కాలనీ రోడ్లు రాళ్ళ తేలి నడకకు నరకంగా ఉండేదని, ప్రస్తుతం డిప్యూటి సిఎం నారాయణస్వామి చొరవతో బిసి కాలనీలు దినదినాభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఇప్పటికే బిసి కాలనీలో రూ.30లక్షలతో వీదుల్లో సిసి రోడ్డు ఏర్పాటు చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని ఆదరించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కోప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీవో మోహనమురళి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కేశవులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న బాలాజి

గూడూరు ఎమ్మెల్యే ఇంటిపై దాడి

- ఖండించిన ఎమ్మెల్యే , బత్తిని

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు సొసైటీ ప్రాంతం లోని ఎమ్మెల్యే వరప్రసాద్ రావు నివాసంలో బుధవారం రాత్రి ఓ వ్యక్తి కలకలం సృష్టించాడు. ప్రభుత్వ పథకాలకు చెందిన ఫ్లెక్సీలు చించివేయడమే కాకుండా ఫర్నీచర్ ధ్వంసం చేశాడు. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వరప్రసాద్ రావు స్థానిక నాయకులతో కలిసి గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ జరిగిన సంఘటనపై డీఎస్పీ, ఇతర పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. వారు విచారించిన తరువాత ఆయన మతి స్థిమితం లేని వ్యక్తి అని, తాగిన వ్యక్తి అని, పారిపోయాడని తెలిపారన్నారు. అదే నిజమైతే హుందాగా ఉంటామని, ఇంకెవరైనా అయితే వైసిపి సత్తా ఏంటో చూపిస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ వ్యక్తి మెడికల్ రిపోర్టు పరిశీలించిన తరువాత స్పందిస్తామని తెలిపారు. ఇటీవల కాలంలో సునీల్ మాట్లాడే భాష సరిగా లేదని ఆయన విమర్శించారు. అనంతరం వైసీపీ సీనియర్ నాయకులు బత్తిని విజయకుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే నివాసంపై గుర్తు తెలియని వ్యక్తి దాడి చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలపై ఎవరైనా దాడులు చేస్తే సహించేది లేదని, కార్యకర్తలు, నాయకులకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వైసిపి పట్టణ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, నాయకులు అజీజ్ ఖాన్, మహేందర్, బట్టా గోపీ యాదవ్, కిష్టయ్య పాల్గొన్నారు.

క్రీడలు పాఠ్యాంశాలలో భాగమే : టీటీడీ డీఈవో

ప్రజాశక్తి - క్యాంపస్ : క్రీడలు పాఠ్యాంశాలలో భాగమేనని విద్యార్థులు క్రీడల్లో కూడా శారీరకంగా రాణించడం ద్వారా మానసికంగా ఉన్నతంగా అభివృద్ధి చెందుతారని టీటీడీ డీఈవో డాక్టర్ ఎం. భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఎస్వీ యూనివర్సిటీ అంతర కళాశాలల పురుషుల క్రీడా పోటీలు ఎస్వీ ఆర్ట్స్ కళాశాల వేదికగా ఘనంగా ముగిశాయి. ఫుట్‌బాల్ విన్నర్స్ ప్రభుత్వ కళాశాల పుత్తూరు, రన్నర్ ఎస్వీ యూనివర్సిటీ జట్లు విజయం సాధించాయి. టెన్నిస్‌లో ఎస్వీ యూనివర్సిటీకి మొదటి స్థానం, ఎస్డిహెచ్ఆర్ డిగ్రీ కాలేజీ ద్వితీయ స్థానం సాధించాయి. విజేతలకు టిటిడి విద్యా శాఖాధికారి డాక్టర్ ఎం భాస్కర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ టీ నారాయణమ్మ, ఫిజికల్ డైరెక్టర్ ముస్తాక్ అహ్మద్, యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ శివశంకర్ రెడ్డి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నారాయణమ్మ మాట్లాడుతూ విద్యార్థులు గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించాలని పిలుపు నిచ్చారు. డిఈఓ డాక్టర్ భాస్కర్ రెడ్డి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జర్నలిస్టు ఉమాశంకర్ ను పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పిచ్చాటూరు: నాలుగు రోజులుగా ఫీవర్ తో బాధపడుతూ చికిత్స చేసుకొని విశ్రాంతి తీసుకుంటున్న పిచ్చాటూరు మండల(సత్యవేడు నియోజకవర్గం ఇంచార్జి)ఆంధ్రప్రభ విలేకరిని ఉమాశంకర్ ను సత్యవేడు నియోజకవర్గం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, వైసిపీ నాయకులు పాల్గొన్నారు.

సామాజిక బస్సు యాత్ర కాదు.. కామెడీ యాత్ర: హరిప్రసాద్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఏ సామాజిక వర్గానికి తగిన న్యాయం చేశారని వైసిపి వారు సామాజిక బస్సు యాత్ర చేస్తున్నారని, వారి సామాజిక వర్గానికే అన్ని పదవులను కట్టబెట్టుకుని యాత్ర చేయడం కామెడీ యాత్రగా ఉందని జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ విమర్శించారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గాని, రాయలసీమ ప్రాంతంలో గాని ఎక్కడ ఎమ్మెల్యేలు చూసినా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారేనని, రిజర్వేషన్స్ ఉన్న స్థానాల్లో గెలుపొందిన వారికి ఎక్కడా ప్రాదాన్యత ఇవ్వడం లేదన్నారు. డ్వాక్రా మహిళలను బస్సు యాత్రకు తీసుకొచ్చి వారిని వైసిపి కార్యకర్తలు ముద్రవేశారన్నారు. తిరుపతిలో మేయర్‌కు తగిన ప్రాధాన్యం లేదన్నారు. నాయకులు కిరణ్, బాబ్జి పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్లు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్ : నవభారత్ సేవ సమాజ్ ఆధ్వర్యంలో సిల్క్ ఇండియా జన శిక్షణ సంస్థ వారి సౌజన్యంతో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. నవభారత్ సేవా సమాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రహమతుల్లాషరీఫ్ మాట్లాడుతూ మహిళలు ఉచిత కుట్టు మిషన్ నేర్చుకోవడం వల్ల ఆర్థికంగా అభివద్ధి చెందుతారని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశ అభివద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు అనిల్, లోకేష్, మంజులవాని పాల్గొన్నారు.

రెవెన్యూ అసోషియేషన్ భవనానికి భూమి పూజ

భూమి పూజలో జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరు: రెవెన్యూ ఉద్యోగుల అసోషియేషన్ భవన నిర్మాణానికి గురువారం చిత్తూరు కలెక్టర్ షన్మోహన్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా రెవెన్యూ ఉద్యోగుల అసోషియేషన్ భవన నిర్మాణానికి భూమిపూజ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డిఆర్‌వో రాజశేఖర్, చిత్తూరు ఆర్‌డివో చెన్నయ్య, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అమర్‌నాథ్, యస్.హుస్సేన్, జిల్లా సెక్రెటరీ, కలెక్టరేట్ ప్రెసిడెంట్ పార్థసారథి,హేమాద్రి రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దూరం

- జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు

ప్రజాశక్తి-కార్వేటినగరం: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. మండలంలోని సురేంద్రనగరం, దళితవాడ, ఎఎడబ్ల్యూ గ్రామాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ వీధుల్లో వర్షపు నీరు నిల్వలు లేకుండా చూడాలన్నారు. అలాగే వ్యర్థాలు ఇంటి ఆవరణంలో లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వారంలో ఒక్కరోజు డ్రైడే పాటించి నీరు నిల్వలున్న పాత్రలను కడిగి ఎండ బెట్టాలని తెలిపారు. కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ బాటిళ్లు, టైయర్లు వంటి వాటిలో వర్షపు నీరు నిల్వ చేరడం వల్ల లార్వాలు, దోమలు నివాశాలకు నిలయంగా మారి డెంగ్యూ, మలేరియా, డైయోరియా, చికెన్‌గున్యా వంటి ప్రాణాంతకమైన జ్వరాలు సోకే అవకాశం ఉంటుందన్నారు. ఆరోగ్య సిబ్బంది ప్రతివారం పరిశుభ్రత లేని ప్రాంతాలను గుర్తించి బ్లీచింగ్ చల్లి, పరిశుభ్రతను మెరుగు పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

గ్రామ వీధులను డాక్టర్ రవిరాజు

పారదర్శకమైన ఓటర్ల జాబితా సిద్ధం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సుజన

ప్రజాశక్తి-నగరి: పారదర్శకమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఆర్డీవో సుజన అన్నారు. గురువారం స్థానిక మెప్మా కార్యాలయంలో బి.ఎల్.ఓ సూపర్ వైజర్లు, బూత్ లెవల్ ఆఫీసర్లు, అన్ని పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లతో ఆమె సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల సంక్షిప్త సవరణ 2024కి సంబంధించి గత నెల 27న ముసాయిదా ఫోటో ఓటర్ల జాబితాను విడుదల చేయడం జరిగిందన్నారు. ఆ జాబితాను మరొకమారు పరిశీలించాలని పారదర్శకమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేసేందుకు అందరూ కలసి పని చేయాలని సూచించారు. రాబోవు సాధారణ ఎన్నికల దృష్ట్యా స్వీప్ ఆక్టివిటీస్‌ని ముమ్మరం చేయుటకు, జెండర్ రేషియో, ఈపీ రేషియోపై ప్రత్యేక దృష్టి సారించండం, 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయండంపై బీఎల్‌వోలకు శిక్షణ అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ వెంకట్రామి రెడ్డి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఆర్వీ ప్రసాద్, టీపీవో నీరజాక్షి, అర్బన్ లెవల్ టీం, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: బిఎల్‌వోలు క్షేత్రస్థాయి ఓట్ల పరిశీలన చేయాలని ఇంచార్జ్ తహశీల్దార్ అనిల్‌కుమార్ అన్నారు. గురువారం మండల కార్యాలయంలో బిఎల్‌వోల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి గడపకు వెళ్లి ఓటర్ లిస్ట్‌ను పరిశీలించి మరణించిన వారిని గుర్తించి కుటుంబ యజమానుల అనుమతితో తొలగించే కార్యక్రమం చేపట్టాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారికి నూతన ఓటరుగా నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపిడివో హరిప్రసాద్‌రెడ్డి, డిటి ఇబ్రహిం తదితరులు పాల్గొన్నారు.

శాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు

పల్లెనిద్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఐ

ప్రజాశక్తి-నగరి: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని సిఐ సురేష్ అన్నారు. మండలంలోని తడుకు గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థను ప్రజలకు చేరువ చేసేందుకే పల్లెనిద్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమైయ్యారు. గ్రామాల్లో ప్రజలు శాంతి వాతావరణంలో జీవించాలన్నారు. సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నాటుసారా, గంజాయి, జూదం వంటివాటిపై సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో వైఎస్ఎంపీపీ కన్నియప్ప, సత్య, సంజీవిరెడ్డి, ముత్తువేలు రెడ్డి, గణపతి రెడ్డి, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా జయచంద్ర

నియామక పత్రం అందుకుంటున్న జయచంద్ర

ప్రజాశక్తి-యాదమరి: చిత్తూరు జిల్లా ఫార్మా జేఏసీ అధ్యక్షుడిగా జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో ఫార్మసిస్టుగా విధులు నిర్వహిస్తున్న కె.జయచంద్రను ఎన్నుకున్నట్లు ఏపీ ఫార్మా జేఏసీ కన్వీనర్ సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గురువారం నగరంలోని వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ఫార్మా జేఏసీ అధ్యక్షుడిగా జయచంద్రను ఫార్మా జేఏసీ కన్వీనర్ సురేష్ బాబు, రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికైనట్లు ప్రకటించి కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిశ్వరి, తదితరుల చేతి మీదుగా నియామక పత్రం అందుజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జయచంద్ర మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర చైర్మన్ సురేష్‌బాబు కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఫార్మసి విద్యార్థుల సమస్యలు, ఫార్మసిస్ట సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎపిజెఏసి చైర్మెన్ సురేష్‌బాబు, ఎపీ ఫార్మా గ్రాడ్యుయేషన్, డాక్టర్ సిద్దయ్య, చిత్తూరు జిల్లా ఫార్మ జెఏసి అధ్యక్షుడు జయచంద్ర, ట్రేజరర్ కోట సుబ్బయ్య, రాయలసీమ ఇంచార్జి రాధాకష్ణ, కడప అధ్యక్షుడు, ఉమామహేశ్వర్, వైస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, స్టేట్ జాయింట్ సెక్రటరి బాలకష్ణ, ఫార్మసీ కళాశాల హెచ్ఓడిలు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇకనైనా అక్రమ కేసులు మానుకోవాలి: టిడిపి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీపై కుట్ర పూరితంగా కేసులు పెడుతూ వారి కుటుంబాలను మనోవేదనకు గురిచేసి పరువు నష్టం కలిగిస్తున్న సీఎం జగన్మోహన్ రెడ్డి ఇకనైనా అక్రమ అక్రమ కేసులు ఆపాలని టిడిపి తిరుపతి పార్లమెంటు శాలివాహన సాధికార సమితి అధ్యక్షులు ఆముదాల తులసీదాస్ ఓ ప్రకటనలో అన్నారు. మద్య నిషేధం అని చెబుతూనే ఆ మద్యాన్ని అడ్డుపెట్టుకొని లక్ష కోట్లు వెనకేసుకున్న జగన్ రెడ్డి టిడిపి ప్రభుత్వంలో అక్రమ మద్యం అనుమతులు మంజూరు చేశారంటూ అక్రమ కేసులు బనాయించడం శోచనీయమన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు తప్పకుండా వైసీపీని ఇంటికి పంపుతారని, ఆ ఓటమి భయంతోనే ప్రజల దృష్టిని మరల్చడానికి ప్రతిపక్ష పార్టీల నాయకులను టార్గెట్ చేసుకొని, పోలీసులను అడ్డుపెట్టుకొని ఇలా అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రకృతి వనరులను తన అనుయాయులకు ఇష్టారాజ్యంగా దోచిపెడుతూ ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని, దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అక్రమ మద్యం అనుమతులు కేసులో ఉద్దేశపూర్వకంగా మాజీ మంత్రి కొల్లు రవీంద్రను ఇరికించారని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీ ఉండకూడదని అనుభవం కలిగిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కూడా స్కిల్ కేసులో ఇరికించి ఇబ్బందుల పాలు చేశారని, అంతిమంగా న్యాయం గెలుస్తుందని చంద్రబాబు విషయంలో కూడా అదే జరుగుతుందన్నారు. చంద్రబాబు నాయుడు ఎంతో దూరదష్టి గల గొప్ప వ్యక్తి అని, అలాంటి ఆయన సేవలు రాష్ట్ర ప్రజలకు అవసరమని ఆనాడు అలిపిరి ఘటనలో తిరుమల శ్రీవారి ఆశీస్సులతో ప్రాణాలతో బయటపడ్డారన్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

- పది మంది జూదరుల అరెస్ట్

జూదరుల అరెస్టు చూపుతున్న పోలీసులు

ప్రజాశక్తి-సోమల: పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి పది మందిని అరెస్టు చేసినట్లు సదుం ఎస్ఐ మారుతి తెలిపారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం మధ్యాహ్నం అందిన ముందస్తు సమాచారంతో సదుం మండలం చింతపర్తివారిపల్లి సమీపంలో చెరువు వద్ద బహిరంగంగా జూదం ఆడుతున్నట్లు గుర్తించి దాడి చేశామన్నారు. 10మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.38,160 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వారిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

IN THE COURT OF THE PRL JUNIOR CIVIL JUDGE OF CHITTOOR
I.A. NO: 759 of 2018
O.S.No: 439 of 2017

Between
Kothakota Narasimha Reddy and others ....Petitioners/Plaintiffs
And
K.Rajendra Reddy (Died) and others ..Respondents/Defendants

NOTICE TO RESPONDANT NO 4:

To: R4
K.Reddy Prasad,
S/o Late K.Rajendra Reddy,
aged about 39 years,
Residing at Kamathampalli Village,
Kollapalli Post, Irala Mandal,
Chittoor District.

Sir, Please take notice that the above named plaintiff filed the above suit for injunction and the above suit is posted to **10/11/2023** for your appearance before the said court. Please be present either inperson or through an advocate on the said date at about **10-30 A.M** and to raise your objections if any, failing which the matter will be decided as exparte in your absence.

Sd/-xxxx
V.SOMASEKHAR REDDY
Counsel of Plaintiffs
Place: Chittoor, Date: 02/11/2023